
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

***



**హెల్ప్‌లైన్ నంబర్లు**

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

| | |
|---|---|
| నల్లగొండ | :18004251442 |
| యాదాద్రి | :1800 425 7106 |
| సూర్యాపేట | :1800 425 1972 |

**చికెన్ ధరలు**

గుడ్డు డజన్ ధర : 65

| జిల్లా | లైవ్ | డ్రెస్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| యాదాద్రి | రూ.119 | 173 | 196 |
| సూర్యాపేట | రూ.120 | 170 | 200 |
| నల్లగొండ | రూ.119 | 173 | 196 |

ఉష్ణోగ్రత గరిష్ఠం 31.0 । కనిష్ఠం 20.2

# ప్రమాద ఘంటికలు



త్రిపురారంలో బీటలు వారిన వరి పొలం

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- గత ఏడాది డిసెంబరులో 7.84మీ., లోతుకు పడిపోయిన నీటిమట్టం
- చందంపేట, నేరడుగొమ్ము, చిట్యాలలో 11మీ., లోతుకు
- సాగర్‌లో 520అడుగుల నీటిమట్టం
- మరో 10అడుగులు తగ్గితే డెడ్ స్టోరేజీ
- తాగునీటి అవసరాలకే సాగర్ నీటి నిల్వలు
- ఆరుతడిపై ఆశలు గల్లంతు
- హైదరాబాద్‌కు తాగునీటికి ప్రత్యామ్నాయ మార్గాలు

**తీవ్ర వర్షాభావ పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడంతో ఉమ్మడి జిల్లాలో వేసవికి ముందే ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. రానున్న రోజుల్లో సాగునీటి సంగతి అటుంచితే తాగునీటికి సైతం ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితులు ఉన్నాయి. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 590అడుగులు కాగా, ప్రస్తుతం 520అడుగులుగా ఉంది. మరో 10 అడుగుల నీటి మట్టం తగ్గితే డెడ్ స్టోరేజీకి చేరనుంది. సాగర్ నీటి నిల్వలను తాగునీటి అవసరాల కోసమే ఇకపై విని యోగించనున్నారు.**

ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఏకేబీఆర్(అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) నుంచి హైదరాబాద్‌కు ప్రతీ రోజు మూడు మోటార్ల ద్వారా రోజుకు 1,350క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. నల్లగొండ జిల్లాకు ప్రతీ రోజు మిషన్ భగీరథ ద్వారా 45క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు. రానున్న రోజుల్లో అంటే నిండు వేసవిలో నీటి ఎద్దడి తీవ్రమయ్యే అవకాశాలు ఉండటంతో పీఏపల్లి మండలం పుట్టంగండి వద్ద అత్యవసర మోటార్లకు మరమ్మతులు చేసే పనిలో అధికారులు ఉన్నారు. సాగర్ 510 అడుగులకు నీటి మట్టానికి పడిపోతే అత్యవసర మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేస్తారు. 506అడుగుల నీటిమట్టం సాగర్‌లో ఉన్నప్పుడు ఈ మోటార్ల ద్వారా నీటి కేటాయింపులు ఉంటాయి. పదేళ్ల క్రితం ఇదే పరిస్థితి ఎదురైంది. సాగర్ ప్రాజెక్టులో జీరో అంటే 450అడుగుల నీటిమట్టం ఉన్నా తాగునీటి అవసరాల కోసం జలాశయానికి ఆనుకొని ఉన్న సుంకిశాల ప్రాంతం నుంచి మోటార్ల ద్వారా నీటిని సరఫరా చేసేలా ప్రయత్నాలు సాగుతున్నాయి. ఇప్పటికే సాగర్ ఆయకట్టు కింద సాగునీటి శాఖ అధికారులు క్రాప్ హాలిడే ప్రకటించడంతో ఆరుతడి సాగుపైనా ఆశలు గల్లంతయ్యాయి.

### యాసంగిలో సాగుకు తీవ్ర ఇబ్బందులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు లేక ఎడమ కాల్వ కింద నాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. గత వానా కాలంతో పాటు యాసంగి సీజన్‌లో ఆయకట్టు రైతులు నాట్లు వేయలేదు. ఏఎమ్మార్పీ, డిండి ప్రాజెక్టుల పరిధిలో సైతం నాట్లు పడలేదు. మూసీ ప్రాజెక్టు ఆయకట్టులో మాత్రం 32వేల ఎకరాల్లో నాట్లు పడగా, మిగతా రైతులు బోర్లు, బావులు ఆధారంగా నాట్లు వేశారు. అయితే వేసవిలో బోర్లు ఎండినా, కరెంట్ కోతలు విధించినా వరి చేతికి రాదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం బోర్లలో నీటి నిల్వలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. వరి పొట్టదశ వచ్చేసరికి నీరు సరిపోతుందో లేదో అని రైతులు వాపోతున్నారు. యాసంగి సీజన్ గత ఏడాది నవంబరు 15 నుంచి ప్రారంభమైంది. మార్చి లేదా ఏప్రిల్ నాటికి పంట చేతికి రానుంది. వర్షాభావ పరిస్థితుల్లో చెరువులు నిండక భూగర్భజలాలు గణనీయంగా పడిపోయాయి. సాగర్ ఎడమ కాల్వ కింద 1.80లక్షల ఆయకట్టు ఉండగా, ఈసారి బోరుబావుల కింద ఆయకట్టులో 30వేల ఎకరాలకు మించి వరి సాగుకాలేదు. ఏఎమ్మార్పీ హైలెవల్, లోలెవల్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు లేవు. ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా యాసంగిలో 5.86లక్షల ఎకరాలు సాగుకావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 2.99లక్షల ఎకరాల్లో మాత్రమే వరితోపాటు ఇతర పంటలు సాగయ్యాయి. వరి 2.73లక్షల ఎకరాల్లో సాగు కాగా, 20వేల ఎకరాల్లో వేరుశనగ, 6వేల ఎకరాల్లో జొన్న, మొక్కజొన్న, ఆముదం, మినుము, బొబ్బర, పెసర పంటలు సాగయ్యాయి. ఈ నెలాఖరులోగా యాసంగి సీజన్ ముగియనుండగా, మరో 40వేల ఎకరాలకు మించి పంటలు సాగయ్యే పరిస్థితి కానరావడం లేదు.

### 7.84మీటర్లకు పడిపోయిన భూగర్భ జలాలు

నల్లగొండ జిల్లాలో వానాకాలంలో 651.4మి.మీ సాధారణ వర్షపాతానికి, 530.4మి.మీ వర్షపాతం నమోదైంది. 18.6మి.మీ., లోటువర్షపాతం ఉంది. అత్యధికంగా 14మండలాల్లో లోటు వర్షపాతంగా నమోదైంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాలు పడిపోగా, మరో రెండు నెలల్లో పరిస్థితి దారుణంగా ఉండే అవకాశాలు ఉన్నాయి. 2022 ఏడాదితో పోలిస్తే 2023 డిసెంబరు నెలాఖరు వరకు నల్లగొండ జిల్లాలో 7.84మీ., లోతుకు నీటి మట్టాలు పడిపోయాయి. 2022 డిసెంబరులో 4.65మీ., లోతులో జలపాతం ఉండగా, 2023లో 7.84మీ., లోతులో భూగర్భ నీటిమట్టం ఉంది. ఏడాదిలో 3.19మీ., కిందికి నీటిమట్టాలు పడిపోయాయి. చందంపేట, నేరడుగొమ్ము, చిట్యాల మండలాల్లో 11మీ., లోతుకు నీటిమట్టాలు పడిపోయాయి.

**నల్లగొండ జిల్లాలో డివిజన్ల వారీగా భూగర్భ జలమట్టం..**

| డివిజన్ | 2022 డిసెంబర్‌లో.. | 2023 డిసెంబర్‌లో.. |
|---|---|---|
| నల్లగొండ | 4.51 మీటర్లు | 7.23 మీటర్లు |
| మిర్యాలగూడ | 4.60 మీటర్లు | 7.66 మీటర్లు |
| దేవరకొండ | 4.86 మీటర్లు | 8.24 మీటర్లు |

**● ఇంత కరువు ఎన్నడూ చూడలే**



20 ఏళ్లగా ఇంత కరువు ఎన్నడూ చూడలేదు. బోరు బావుల ఆధారంగా కొంతమేర వరి సాగు చేశా. కనీసం ఆరుతడికి నీళ్ల వదులుతారని ఆశతో సాగు చేశాం. కానీ సాగర్ ప్రాజెక్టులో నీళ్ల అడుగంటిపోవడంతో ఆశలు నీరుగారాయి. ఈ యాసంగిలో వేసిన పంట చేతికి వచ్చే అవకాశాలు కనబడటం లేదు. ఆయకట్టు కింద లక్షలాది రైతుల పరిస్థితి ఇలాగే ఉంది.

సయ్యద్, రైతు, త్రిపురారం



# పట్టు సాగు తగ్గుతోంది

**తగ్గిన దిగుబడి, ధర ● ఐదేళ్లుగా అందని బోనస్**

**సాగు మానేస్తున్న రైతులు**

**మోత్కూరు, జనవరి 24:** వాతావరణం అనుకూలించక, గిట్టుబాటు ధర లభించక రైతులు ఏ పంట సాగు చేసినా నష్టాలనే చవిచూస్తున్నారు. కొత్త పంట సాగు సమయంలో కొంత ఆశాజనకంగా ఉన్నా, ఆ తరువాత దిగుబడి, ధర తగ్గి నష్టపోతున్నారు. పట్టు పురుగుల పెంపకం కూడా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటోంది. పట్టు పురుగుల పెంపకం లాభదాయకంగా ఉంటుందని, షెడ్ నిర్మాణానికి సబ్సిడీ, కిలో పట్టుగూళ్లకు రూ.75 చొప్పున బోనస్ ఇచ్చి ప్రభుత్వం ప్రోత్సహించింది. ఏడాదికి ఏడెనిమిది పంటలు తీయవచ్చని సెరికల్చర్ అధికారులు విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో పలువురు రైతులు వరి, పత్తి, కంది లాంటి సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి దశాబ్ద కాలంగా మల్బరీ సాగు (పట్టు పురుగుల పెంపకం) చేపట్టారు. మొదట్లో సాగు లాభదాయకంగానే ఉన్నా, ఇటీవల పురుగులు గూళ్లు కట్టకపోవడం, పట్టు గూళ్ల ధర బాగా పడిపోవడం, ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో పట్టు రైతులు నష్టాల ఊబిలో కూరుకుపోయారు. మోత్కూరు మండలంలో 100ఎకరాల్లో మల్బరీ సాగువుతోంది.

### గూళ్లు అల్లని పురుగులు

వారం ఎదిగిన పట్టు పురుగులను తెచ్చి రైతులు షెడ్లలో వేసి మల్బరీ ఆకులను మేతగా ఇస్తారు. మూడు వారాల్లో అవి పట్టుగూళ్లను అల్లుతాయి. గూడు అల్లడం మొదలు పెట్టగానే రైతులు వాటిపై చంద్రికలు పరుస్తారు. నాలుగైదు రోజుల్లో గూళ్ల అల్లిక పూర్తవుతుంది. ఆరో రోజున వాటిని వేరు చేసి, ఏడో రోజున మార్కెట్‌కు తరలించి విక్రయిస్తారు. అయితే ఐదారు మాసాలుగా పట్టు పురుగులు గూళ్లు అల్లడం లేదు. గతంలో 100గుడ్ల పురుగులు పెంచితే 85 నుంచి 90కిలోల వరకు దిగుబడి రాగా, ప్రస్తుతం 60 నుంచి 65కిలోలకు పడిపోయింది.

### నాణ్యతపై అనుమానాలు

రాష్ట్రంతో పాటు పలు దక్షిణాది రాష్ట్రాల్లో రైతులు మల్బరీ సాగు చేస్తున్నారు. దిగుబడి తగ్గడానికి విత్తన నాణ్యతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పురుగులు గూళ్లు కట్టని విషయాన్ని శాస్త్రవేత్తలు కూడా గుర్తించి కారణాలను అన్వేషిస్తున్నారు. షెడ్ల చుట్టూ వరి, పత్తి లాంటి పంటలు వేసి, వాటికి అధికంగా క్రిమిసంహారక మందులు పిచికారీ చేస్తే ఆ మందుల ప్రభావంతో పట్టు పురుగులు గూళ్లు అల్లడం లేదని అధికారులు చెబుతున్నారు.

### బాగా తగ్గిన ధర

గత ఏడాది పట్టుగూళ్ల ధర కిలో రూ.750 ఉండగా, ఇప్పుడు రూ.470కి పడిపోయింది. ఒక్కో రైతు పంటకు 250 నుంచి 300 వరకు పురుగులు పెంచుతారు. 250 పురుగులు పెంచే రైతుకు గతంలో 215 కిలోల దిగుబడి సాధించగా, ప్రస్తుతం 165కిలోలే వస్తోంది. ధర గతంలో కిలో రూ.750 చొప్పున 215 కిలోలకు రూ.1,61,250 వచ్చేవి. ప్రస్తుతం కిలో రూ.470 చొప్పున 165 కిలోలకు రూ.77,550 మాత్రమే వస్తోంది. సగానికిపైగా ఆదాయం తగ్గింది.

### రైతులకు అందని బోనస్

పట్టు రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కిలోకు రూ.75 చొప్పున బోనస్ ఇవ్వాల్సి ఉండగా, 2018 నుంచి వాటిని చెల్లించడం లేదు. ఒక్కో రైతుకు రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు బోనస్‌గా రావాల్సి ఉంది. దిగుబడి, ధర తగ్గడం, ప్రభుత్వం బోనస్ ఇవ్వకపోవడంతో కొందరు రైతులు మల్బరీ తోటలను తొలగిస్తుండగా, మరి కొందరు నష్టాలను చవిచూస్తూ అలానే కొనసాగిస్తున్నారు.

**రూ.2.50లక్షల బోనస్ రావాలి**



సుమారు దశాబ్దకాలానికి పైగా మల్బరీ సాగు చేస్తున్నా. ఐదారు మాసాలుగా దిగుబడి తగ్గింది. పట్టు గూళ్ల ధర కూడా పడిపోయింది. 2018 నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి రూ.2.50లక్షల బోనస్ రావాలి. నూతన ప్రభుత్వమైనా మా సమస్యలు పరిష్కరించాలి.

బండ విజయ్‌రెడ్డి, పట్టు రైతు, పాటిమట్ల

# పెండింగ్ కేసులు తగ్గించాలి

**● ఎస్పీ చందనా దీప్తి**



మాట్లాడుతున్న ఎస్పీ చందనా దీప్తి

**నల్లగొండ టౌన్, జనవరి 24:** పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరిస్తూ సాధ్యమైనంత త్వరగా తగ్గించడానికి ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని ఎస్పీ చందనా దీప్తి అధికారులను ఆదేశించారు. పోలీసు అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న (అండర్ ఇన్వెస్టిగేషన్) కేసులు గ్రేవ్ నాన్ గ్రేవ్ కేసుల్లో ఇన్వెస్టిగేషన్ చేసేటప్పుడు ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్‌తో పూర్తి పారదర్శకంగా చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్నీ కూలంకుషంగా పరిశోధన చేసి పూర్తి చేయాలన్నారు. పోక్సో, గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. ప్రతి అధికారికీ పూర్తి ఇన్వెస్టిగేషన్, స్టేషన్ మేనేజ్మెంట్ తెలిసి ఉండాలని సూచించారు. అవసరమైతే సంబంధిత న్యాయమూర్తులను స్వయంగా కలిసి కేసుల పరిష్కారానికి మరింత చొరవ చూపాలని సూచించారు. పోలీసు శాఖ చేపట్టిన 16 ఫంక్షనల్ వర్టికల్స్ రిసెప్షన్, క్రైమ్ వర్టికల్, టెక్ టీమ్, స్టేషన్ రైటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్, తదితర వర్టికల్స్‌ను పటిష్టంగా అమలు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా గ్రామాల్లో సీసీకెమెరాల ప్రాముఖ్యంపై అవగాహన కల్పించి, వాటి ఏర్పాటుకు కృషిచేయాలన్నారు. మహిళల భద్రతకు మరింత భరోసా కల్పిస్తూ వారి రక్షణ ప్రధాన ధ్యేయంగా నాణ్యమైన, సత్వర సేవలు అందించాలన్నారు. సైబర్ క్రైం, డయల్ 100 వాటి వినియోగంపై విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అనుసరించాలన్నారు. ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు గంజాయి, జూదం, పీడీఎస్ రవాణా లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి పటిష్టమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. నేషనల్ స్టేట్ హైవేలో ఉన్న అన్ని బ్లాక్ స్పాట్లను పరిశీలించి ప్రమాదాల గల కారణాలను తెలుకొని వాటి నియంత్రణకు కావలసిన ఇతర సంబంధిత అధికారులు ట్రాన్స్‌పోర్టు, ఆర్టీసీ,హైవే అథారిటీ, గ్రామపంచాయతీ అన్ని శాఖల సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి గ్రామంలో రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రతా నియమావళి పైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రమాదాలు జరగకుండా ప్రతిరోజూ డ్రంకెన్ డ్రైవ్‌లు నిర్వహించాలన్నారు. ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్బీ డీఎస్పీ సోమ్ నారాయణ్‌సింగ్, డీఎస్పీ విఠల్‌రెడ్డి, నల్లగొండ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ వెంకటగిరి, డీసీఆర్బీ డీఎస్పీ సైదా పాల్గొన్నారు.

# ఎడమకాల్వకు నీరు విడుదల చేయాలి

**● మంత్రి ఉత్తమ్‌కు తెలంగాణ రైతు సంఘం వినతి**

**మిర్యాలగూడ, జనవరి 24:** సాగర్ ఎడమకాల్వకు నీరు విడుదల చేసి పంటలను కాపాడాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. రైతుసంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ నీటిపారుదల శాఖామంత్రి నల్లమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జూలకంటి మాట్లాడుతూ ఇప్పటికే రైతులు చెరువుల్లో ఉన్న నీటిని ఆధారం చేసుకుని వరి సాగు చేశారన్నారు. చెరువుల్లో నీరు అయిపోవడం, భూగర్భ జలాలు తగ్గి బోరుబావులు ఎండిపోతున్నాయన్నారు. దీంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల్లో వరి పొలాలు పొట్టదశకు చేరుకున్నాయని, నీరు అందక ఈత వేయకుండానే పైర్లు ఎండిపోయే స్థితికి చేరుకుంటున్నాయన్నారు. పది రోజుల పాటు ఎడమకాల్వకు నీరు విడుదల చేసి చెరువులు నింపినట్లయితే చెరువుకింది రైతులతో పాటు భూగర్భజలాలు పెరిగి బోరు బావుల రైతుల సేద్యానికి సైతం ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, ప్రధాన కార్యదర్శి టి. సాగర్, సహాయకార్యదర్శి మూడ్ శోభన్ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేస్తున్న జూలకంటి తదితరులు

# చదువుతోనే భవిష్యత్‌కు బాటలు

**● కలెక్టర్ హరిచందన దాసరి**



అవంతపురం ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే

**నల్లగొండ టౌన్, జనవరి 24:** చదువుతోనే భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని కలెక్టర్ హరిచందన దాసరి అన్నారు. 'ఆడపిల్లను రక్షిద్దాం ఆడపిల్లను చదివిద్దాం' అనే నినాదంతో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖల ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లోని ఉదయాదిత్యభవన్‌లో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, బాలికలు అందరూ చదువుకోవడంతో పాటు, కుటుంబం, పొరుగు వారికి అందరూ చదువుకునేలా అవగాహన కలిగించాలన్నారు. ఎవరూ మధ్యలో చదువు మానేయొద్దని సూచించారు. సమాజంలో బాలికల పట్ల వివక్ష ఉండొద్దని, మహిళలు కుటుంబంతో పాటు అన్ని రంగాల్లో గొప్పగా రాణిస్తున్నారని దీని అంతటికీ చదువే కారణమన్నారు. విద్య ద్వారా ప్రభుత్వం సమాన అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. చిన్నవయసులో పెళ్ళిళ్లు చేసుకుని కష్టాలను కొనితెచ్చుకోవద్దన్నారు. బాగా చదివి జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం గురించి ఆలోచించాలన్నారు. భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్, ఇంజనీర్, ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించడానికి కష్టపడి చదివి ఉన్నత స్థితికి ఎదగాలని,సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు. ప్రభుత్వ పథకాల్లో భాగంగా మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు, బాలికలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తోందన్నారు. మహిళలు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దీప్తి మాట్లాడుతూ సమాజంలో బాలికల రక్షణ, సంరక్షణ, హక్కులు, వైద్యం, విద్య, పోషకాహారం, నివాసం, సామాజిక, న్యాయ అంశాలపై అవగాహన కలిగించారు. అనంతరం బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వివిధ రంగాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 31మంది విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమొంటోలతో బహూకరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి, డీఎంహెచ్‌వో కొండల్‌రావు, ఎస్ఐ అంజలి తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలి

జిల్లాలో మంజూరై పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని ఇంజనీరింగ్ శాఖ అధికారులను కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్‌తో కలిసి పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ, వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, విద్య మౌలిక సదుపాయాలు అభివృద్ధి సంస్థ, మిషన్ భగీరథ ఇంజనీరింగ్ ఎస్ఈలు, ఈఈలు, డీఈలతో బుధవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ద్వారా చేపట్టిన అంగన్‌వాడీ భవనాలు, పీహెచ్‌సీ సబ్‌సెంటర్ భవనాలు, నిర్మాణ పనులు, ప్రగతి సమీక్షిం చారు. ఇప్పటివరకు మొదలుకాని పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ఇంకా మొదలుపెట్టని పనులు పంచాయతీరాజ్ ఇంజనీరింగ్‌శాఖతో పాటు మిషన్ భగీరథ, విద్య, మౌలిక సదుపాయాల సంస్థ ఇంజనీరింగ్ అధికారులు విభజించుకోవాలన్నారు.

# తాగునీటి సమస్య లేకుండా చూడాలి

**● అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్**



అవంతపురంలో ప్లాంట్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్, ఎమ్మెల్యే

**మిర్యాలగూడ, జనవరి 24:** వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డితో కలిసి అవంతీపురం మిషన్‌భగీరథ ప్లాంట్‌ను బుధవారం తనిఖీ చేశారు. నీటి శుద్ధి, పైపులైన్, పంపింగ్ విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నియోజకవర్గంలో తాగునీటి సమస్య ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో భగీరథ నీరు సరఫరా కావడం లేదని, టౌన్‌లోని కొన్ని వార్డుల్లో తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ వెంకటేశ్వర్లు, ఈఈ వంశీకృష్ణ, పాపారావు, డీఈ సంపత్‌కుమార్, అన్వర్, మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు

**నల్లగొండ టౌన్, జనవరి 24:** తూనికలు కొలతల్లో మోసాలకు పాల్పడితే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని ప్రకాశంబజార్‌లో గల కూరగాయల మార్కెట్, ఫిష్, మటన్ మార్కెట్‌లలో తూనికలు కొలతల్లో జరిగే మోసాలపై వినియోగదారులకు కల్పించారు. అనంతరం మార్కెట్లో వినియోగిస్తున్న తూకపు రాళ్లను సరిచేసి ముద్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తూకాల్లో ఎటువంటి మోసాలకు పాల్పడినా లీగల్ మెట్రోలజీ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రిపేరింగ్ లైసెన్స్ హోల్డర్స్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు

# గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సస్పెన్షన్

**● ప్రిన్సిపాల్‌కు మద్దతుగా విద్యార్థినుల ఆందోళన ● మా ప్రిన్సిపాల్ మాకే కావాలని నినాదాలు**



ప్రిన్సిపాల్‌కు మద్దతుగా ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

**కొండమల్లేపల్లి జనవరి 24:** కొండమల్లేపల్లి సాంఘిక సంక్షేమశాఖ బాలికల గురుకుల పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని భార్గవి మృతి నేపథ్యంలో పాఠశాల ప్రిన్సిపాల్ విజయలక్ష్మిని సస్పెండ్ చేస్తూ టీఎస్ డబ్ల్యూఆర్ సెక్రెటరీ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం పాఠశాలలో విద్యార్థినులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. విద్యార్థిని భార్గవి మృతితో ఎలాంటి సంబంధం లేని ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేశారని అన్నారు. 'మా ప్రిన్సిపాల్‌ను తిరిగి మాకే కేటాయించాలి' అని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. విద్యార్థినులు పెద్దసంఖ్యలో ప్రిన్సిపాల్‌కు మద్దతుగా ఆందోళన చేపట్టారు. విద్యార్థినుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపే ప్రిన్సిపాల్ సస్పెండ్ అమానుషమని తిరిగి ప్రిన్సిపాల్‌ను తమ పాఠశాలకే కేటాయించాలని కోరారు. ప్రిన్సిపాల్ విజయలక్ష్మికి మద్దతుగా విద్యార్థినులు సాయంత్రం వరకు ఆందోళన కొనసాగించారు. తెలుగు ఉపాధ్యాయురాలు రమణను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

# తరగతులు నిర్వహించడం లేదు

**● పెద్దవూర తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థుల ధర్నా**

**పెద్దవూర, జనవరి 24:** వేతనాల కోతతో ఉపాధ్యాయులు మూకుమ్మడిగా విధులకు హాజరు కాకపోవడంతో తమకు తరగతులు జరగడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో 2016-17 విద్యా సంవత్సరం నుంచి ఇప్పటివరకు తాత్కాలిక పద్ధతిలో అకడమిక్ ఇన్స్‌పెక్టర్ల పేరుతో గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులను నియమించింది. వీరికి రూ.12వేల గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి వీరికి ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా పీఎఫ్, ఇన్సూరెన్స్, జీఎస్టీ వంటి వాటిని మినహాయించి నెలకు రూ.7,373 చెల్లిస్తున్నారు. దీంతో వారు ఈనెల 22 నుంచి విధులకు మూకుమ్మడిగా హాజరు కావడం లేదు. విద్యాబోధన జరగడం లేదని ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ జిల్లా అధికారులకు తెలియజేశారు. తమకు క్లాసులు జరగడం లేదని, సిలబస్ పూర్తి కాలేదని, పరీక్షలు దగ్గర పడడంతో తమకు విద్యాబోధన చేసేవారు లేక తమ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సరోజకు వినతిపత్రం అందజేశారు.

# యాదగిరిక్షేత్రంలో శాస్త్రోక్తంగా నిత్య పూజలు

*నిత్యాదాయం రూ. 16.80లక్షలు*

**యాదగిరిగుట్ట, జనవరి 24:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో బుధవారం నిత్యవిధి కైంకర్యాలు ఆగమశాస్త్ర రీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయంలో కొలువైన స్వయంభువులను సుప్రభాతంతో మేల్కొపిన అర్చకులు పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం నిత్య తిరుకల్యాణం సంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఆర్జిత సేవల్లో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామి ఆశీస్సులు అందజేశారు. కొండపైన శివాలయంలో రామలింగేశ్వరుడికి నిత్యపూజలు, యాగశాలలో నిత్యరుద్ర హవనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. స్వామిని సుమారు 10వేలకు పైగా మంది భక్తులు దర్శించుకోగా, ఆలయ ఖజానాకు రూ.16,80,479 ఆదాయం సమకూరినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు.

# కుమారుడిని హత్యచేసిన తల్లికి జీవితఖైదు

- *సహకరించిన ప్రియుడికీ శిక్ష*
- *తీర్పు చెప్పిన నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్టు*

**నల్లగొండ టౌన్, జనవరి 24:** వివాహేతర సంబంధానికి అడ్డు వస్తున్నాడని కుమారుడిని హత్యచేసిన తల్లికి, అందుకు సహకరించిన ప్రియుడికీ యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నల్లగొండ జిల్లా సెషన్స్ కోర్టు బుధవారం తీర్పు ఇచ్చింది. ఇందుకు సంబంధించిన వివరాలను రూరల్ ఎస్ఐ కంచర్ల భాస్కరరెడ్డి తెలిపారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం బుద్దారం గ్రామానికి చెందిన పలేటి విజయ, వెంకన్న దంపతులకు ఇద్దరు కుమారులు అఖిల్, నాగరాజు ఉన్నారు. విజయ అదే గ్రామానికి చెందిన తోకల వెంకట్‌రెడ్డితో వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయాన్ని చిన్న కుమారుడు నాగరాజు(9 సంవత్సరాలు) గమనించి తండ్రికి చెబుతానన్నాడు. దీంతో ఆగ్రహించిన విజయ, వెంకట్‌రెడ్డి 2020 ఫిబ్రవరి 21వ తేదీన బాలుడిని ఇంట్లోనే టవల్‌తో గొంతు నులిమి చంపేశారు. అయితే బాలుడి మెడపై నల్లటి మచ్చలు ఉండడాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అప్పటి సీఐ ఎస్‌కె. మహబూబ్‌పాష కేసు నమోదుచేసి దర్యాప్తు ప్రారంభించి, కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. 90 రోజుల అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన విజయను భర్త అంగీకరించకపోవటంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. వెంకటరెడ్డి గ్రామంలోనే ఉంటున్నాడు. ఈ కేసుకు సంబంధించి సాక్షులను విచారించిన జిల్లా కోర్టు న్యాయమూర్తి ఎం. నాగరాజు నిందితులిద్దరికీ యావజ్జీవ కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు బుధవారం చెప్పారు.

# 'రెవెన్యూ' వద్ద ఆ భూమి రికార్డుల్లేవ్!

- హైదరాబాద్-శ్రీశైలం హైవే భూమి వివరాలివ్వాలని ఎన్‌హెచ్‌ఏఐకు వినతి
- 'రహదారికీ రైతుబంధు'పై విస్తృత చర్చ
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై అధికారుల ఆరా

ఆమనగల్లు, జనవరి 24(ఆంధ్రజ్యోతి): 'రహదారికీ రైతుబంధు' శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం సర్వత్రా చర్చనీయాంశమైంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి నిర్మించిన భూమికి ప్రభుత్వం ఏళ్లుగా రైతుబంధు సొమ్ము ఇస్తూ వచ్చిన వైనాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటపెట్టింది. అయితే రోడ్డు నిర్మించిన భూమికి సంబంధించి రెవెన్యూ అధికారుల వద్ద సరైన రికార్డులు లేనట్లు సమాచారం. దాంతో ఆ రికార్డులు అందజేయాలని రెవెన్యూ అధికారులు.. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులను కోరినట్లు తెలిసింది. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు, కడ్తాల్ మండలాల్లో ఈ సమస్య వెలుగుచూసింది. రోడ్డు కోసం పట్టా భూములను సేకరించినా దానికి అనుగుణంగా రికార్డుల్లో మార్పు చేయలేదు. గత ప్రభుత్వ లోపాల వల్ల ఈ భూమికి రైతుబంధు సహాయం అందుతుండడమే కాక మరో సమస్య కూడా తలెత్తుతోంది. భూముల ధరలకు రెక్కలు వస్తుండడంతో చాలామంది రైతులు జాతీయ రహదారి ఉన్న భూమిని కూడా ధరణి రికార్డుల ఆధారంగా విక్రయించి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఫిర్యాదులు ఉన్నా యి. ఇదే జరిగితే పెద్దఎత్తున వివాదాలు చోటు చేసుకునే అవకాశాలు లేకపోలేదు. ఇటీవల కడ్తాల- మైసిగండి మధ్య రోడ్డు నిర్మా ణం జరిగిన 1.20 ఎకరాల భూమి.. ధరణి పాస్ పుస్తకంలో కూడా ఉండడంతో రూ.5 కోట్లకు విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, దాన్ని వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయకుం డా బ్లాక్‌లిస్టులో పెట్టాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు కూడా ఫిర్యాదు అందింది.



హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి

కాగా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను రికార్డులు అడగడంతో పాటు రోడ్డు ఉన్న సర్వే నంబరు భూములను పరిశీలించి సంబంధిత రైతుల రికార్డుల నుంచి ఆ భూమిని తొలగించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. ఇటు ప్రభుత్వం ఈ విషయమై ఉన్నతస్థాయి విచారణ జరిపిస్తే అనేక విషయాలు వెలుగుచూసే అవకాశం ఉందన్న అభిప్రాయం స్థానిక ప్రజల నుంచి వ్యక్తమవుతోంది. ఆమనగల్లుకు చెందిన ఓ రైతు ఇటీవల స్థానిక తహసీల్దార్‌కు, కడ్తాల్‌కు చెందిన మరో రైతు ప్రజావాణిలో సీఎం రేవంత్ రెడ్డికి ఇదే విషయమై ఫిర్యాదు చేశారు.

# కేసీఆర్‌ను సీఎం చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశానికి కేటీఆర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బాధాకరమేమీ కాదని, చాలా చిన్న దెబ్బ మాత్రమే తగిలిందని అన్నారు. "ప్రజలు మనల్ని ఛీకొట్టలేదు. 39 స్థానాల్లో గెలిచాం. మరో 14 స్వల్ప తేడాతో ఓడాం. ఆ 14 స్థానాల్లో ఇతర పార్టీలు గతంలో రెండు, మూడు, నాలుగుసార్లు వరుసగా పోటీచేసి.. ఒక్కసారైనా గెలిపించాలంటూ ఏడవడంతో ప్రజలు భావోద్వేగాలతో వారికి ఓటేశారు. ఇందులో ఆరేడు స్థానాలు బీఆర్ఎస్ గెలిస్తే ఎలా ఉండేది? 1.85 శాతం ఓట్ల తేడాతో మాత్రమే అధికారం కోల్పో యాం" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ప్రజల తీర్పు ను అవమానపరిచే విధంగా మాట్లాడవద్దని పార్టీ శ్రేణులు, సోషల్ మీడియా వారియర్స్‌కు సూచించారు. "కరీంనగర్ లోక్‌సభ పరిధిలోని 7 అసెంబ్లీ సెగ్మెంట్లలో కరీంనగర్, సిరిసిల్ల, హుజూరాబాద్‌లో గెలిచాం. మిగిలిన నాలుగింటిలో కూడా వారు సానుభూతితోనే గెలుపొందారు. అయినా మనకంటే వారికి కేవలం ఐదారు వేల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చా యి. ఈ ఏడుపు, సానుభూతి ఎప్పటికీ ఉండదు" అని వ్యాఖ్యానించారు.



బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్ భేటీలో మాట్లాడుతున్న కేటీఆర్

### 420 హామీలతో ప్రజలను నమ్మించారు..

ఎన్నికల్లో తప్పుడు హామీలతో రేవంత్‌రెడ్డి ప్రజలను నమ్మించారని కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలే కాకుండా.. మేనిఫెస్టోలో పేర్కొన్నవన్నీ కలిపి 420 హామీలు ఇచ్చారని, వాటిని ప్రజలకు వివరించి అమలయ్యే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు. హామీలు అమలు చేయకుంటే రోడ్డుపై బట్టలూడదీసి ప్రభుత్వాన్ని నగ్నంగా నిలబెడతామని హెచ్చరించారు. సోషల్ మీడియాను పదునుగా వాడుకొని నరేంద్రమోదీ ప్రధానమంత్రి, రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. రైతు భరోసా ఇచ్చామంటూ రేవంత్‌రెడ్డి దావో‌స్‌లో వచ్చి అబద్ధం చెప్పారని, రైతుబంధు పేరు మార్చారే తప్ప.. డబ్బులు ఇవ్వలేదని తెలిపారు. రైతుబంధు పడలేదంటే చెప్పుతో కొడతామంటూ మంత్రి కోమటిరెడ్డి చేసిన వాఖ్యలపై కేటీఆర్ మండిపడ్డారు. రైతు భరోసా రాని70 లక్షల మంది రైతులు ఈ ప్రభుత్వాన్ని చెప్పుతో కొడతారో, ఓట్లతో కొడతారో ఆలోచించుకోవాలన్నారు. క్వింటాల్ ధాన్యానికి ఇస్తామన్న రూ.500 బోనస్ ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. మార్పు కావాలని ఓట్లు వేసిన 6.5 లక్షల ఆటో కార్మికుల కుటుంబాల కొంప కొల్లేరు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వారికి ఏ అవకాశమచ్చినా కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాత పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఎరువులు, విత్తనాల దుకాణాల వద్ద క్యూ కట్టాల్సి వస్తుందని ఎవరూ అనుకోలేదని, మళ్లీ ఆ రోజులు వచ్చాయని విమర్శించారు. బస్సుల సంఖ్యను పెంచకుండా, బస్సుల కండిషన్ ఎలా ఉందో తెలుసుకోకుండా అనాలోచితంగా మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయడంతో బస్సుల్లో వారు కొట్టుకుంటున్నారని తెలిపారు. మరోవైపు డబ్బులు పెట్టుకొని వెళ్లే పురుషులకు సీట్లు దొరకడం లేదని, ఎవరూ సంతృప్తిగా లేరని అన్నారు. రూ.500కే గ్యాస్ సిలిండర్ హామీ ఏమైందని ప్రశ్నించారు. రాష్ట్రంలోని కోటి 57 లక్షల మంది మహిళలకు నెలకు 2,500 ఇవ్వకుంటే తాట తీయాలని పిలుపునిచ్చారు. నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారని అసెంబ్లీలో ప్రశ్నిస్తే.. తాము ఆ హామీ ఇవ్వలేదని భట్టివిక్రమార్క అన్నారని చెప్పారు.

### మతం, దేవుళ్లతో బీజేపీ రాజకీయం..

బీజేపీ ఎంపీలు మతం, దేవుళ్లతో దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. నిత్యం మతం, ధర్మం అంటూ రెచ్చగొడుతూ కరీంనగర్‌లో గెలిచిన బండి సంజయ్‌కుమార్ అట్టర్ ఫ్లాప్ ఎంపీ అని విమర్శించారు. వేములవాడ, కొండగట్టు, ఇల్లందకుంట రామాలయానికి మోదీ నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాలేదన్నారు. ఐదేళ్లలో సంజయ్ చేసిన అభివృద్ధి ఏంటో మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటేనంటూ కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నలుగురు ఎంపీలను ఓడించింది బీఆర్ఎస్ కాదా? రెండు పార్టీలు ఒకటైతే కామారెడ్డిలో కేసీఆర్ ఓడిపోయేవారా? అని ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మోదీ, అదానీ ఒకటేనంటూ రేవంత్, రాహుల్ గాంధీ ప్రచారం చేశారని, ఇప్పుడు ఆయనతోనే ఒప్పందం కుదుర్చుకున్నారని విమర్శించారు. బీజేపీ డబుల్ ఇంజన్ సర్కార్‌లో మోదీ, అదానీ తరువాత.. రేవంత్ మూడో ఇంజన్‌గా మారారన్నారు. కేసీఆర్ సర్కారు పదేళ్ల అదానీని రాష్ట్రంలో అడుగుపెట్టనీయలేదని, అమిత్‌షా, మోదీ సూచనతోనే అదానీతో రేవంత్ ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని విద్యుత్ ప్రాజెక్టులు, ఇతర సంస్థలను అదానీకి కట్టబెడతారన్నారు. రేవంత్ మరో ఏక్‌నాథ్ షిండే అయినా ఆశ్చర్య పోవలసిన అవసరం లేదని, మైనారిటీలు ఆలోచించాలని సూచించారు.



మీడియాతో ప్రభాకర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మహిపాల్‌రెడ్డి

## విపక్ష ఎమ్మెల్యేలు సీఎంను కలవకూడదా?

- రేవంత్ తెలంగాణ రాష్ట్రానికి సీఎం కాదా?
- సమస్యల పరిష్కారం కోసమే కలిశాం
- పార్టీని వీడేది లేదు.. ప్రతిపక్షంలోనే ఉంటాం
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీత, ప్రభాకర్‌రెడ్డి మహిపాల్‌రెడ్డి, మాణిక్‌రావు స్పష్టీకరణ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):"కాంగ్రెస్ పార్టీకే.. రేవంత్ ముఖ్యమంత్రా? తెలంగాణకు కాదా? నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం ప్రతిపక్ష నేతలు సీఎంను కలవకూడదా?" అని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సునీతా లక్ష్మారెడ్డి, గూడెం మహిపాల్‌రెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, కె.మాణిక్‌రావు ప్రశ్నించారు. తాము కాంగ్రెస్‌లో చేరుతున్నామంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. రెండ్రోజుల క్రితం ఈ నలుగురు ఎమ్మెల్యేలూ సీఎం రేవంత్‌ను కలవడంతో వారు పార్టీ మారుతున్నారన్న ప్రచారం జోరందుకుంది. ఈ నేపథ్యంలో వారు బుధవారం మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌ను మర్యాదపూర్వకంగానే కలిశామని, ప్రజాసమస్యలను చర్చించడంతోపాటు సెక్యూరిటీ, ప్రొటోకాల్ సమస్యలపై కూడా మాట్లాడామన్నారు. ప్రతిపక్షంలో ఉంటే సీఎంను, మంత్రులను కలవకూడదా? ప్రధాని మోదీని, కేంద్రమంత్రులను సీఎం రేవంత్ కలవడం లేదా అని ప్రశ్నించారు. తమ నియోజకవర్గాల్లో సమస్యల పరిష్కారం కోసం, అభివృద్ధి అంశాల్లో సహకరించాలని సీఎంను కోరామన్నారు. కాంగ్రెస్ లోకి వెళ్లాల్సిన అవసరం తమకు ఏముందని వారు ప్రశ్నించారు. సీఎంను మాత్రమే కాదని, సమస్యల పరిష్కారం కోసం మంత్రులనూ కలుస్తూనే ఉంటామన్నారు. తమపై చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఆపాలని, లేకుంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పార్టీ మారే ప్రసక్తే లేదని.. ప్రతిపక్షంలోనే ఉండి పోరాడతామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్సే మెజార్టీ స్థానాల్లో గెలుస్తుందని అన్నారు.

# రాహుల్ ప్రజల్లోకి వెళ్తుంటే బీజేపీకి ఎందుకంత భయం?

- గుడికి వెళ్లడానికీ అసోం సీఎం అనుమతి కావాలా?
- అప్పట్లో బతుకమ్మ పేరుతో కవిత మాదిరిగానే ఇప్పుడు రామాలయం పేరుతో మోదీ సినిమా చూపిస్తున్నారు..
- అయోధ్య గుడికి కారకుడైన ఆడ్వాణీని సన్మానించారా?: జగ్గారెడ్డి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): "రాహుల్‌గాంధీ ప్రజల్లోకి వెళుతుంటే.. బీజేపీకి ఎందుకంత భయం? రాహుల్ గాంధీ గుడికి పోవద్దా? అందుకు అసోం సీఎం అనుమతి తీసుకోవాలా?" అంటూ టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ప్రశ్నించారు. అసోం ప్రజలకు ఇబ్బంది లేకుండా రాహుల్‌గాంధీ పాదయాత్ర సాగుతోందని, అయితే ప్రధాని మోదీ దగ్గర మెప్పు కోసమే పాదయాత్రను అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ అడ్డుకున్నారని ఆరోపించారు. దేశం కోసం ప్రాణాలర్పించిన గాంధీ కుటుంబం నుంచి వచ్చిన రాహుల్ గాంధీని యాత్ర చేయకుండా అడ్డుకునే కుట్రను బీజేపీ చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. గాంధీభవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. మోదీ పాలనలో న్యాయమైన పాలన జరగట్లేదని, ధరల పెరుగుదలకూ అడ్డూ అదుపూ లేకుండా పోతోందని విమర్శించారు. దీనిపై ప్రజలను సంఘటితం చేసే పనిలో భాగంగా రాహుల్‌గాంధీ 'న్యాయ్ యాత్ర'ను చేపట్టారని, అసోంలో రాహుల్ యాత్రను బీజేపీ వాళ్లు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? అని జగ్గారెడ్డి ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అసోం ప్రభుత్వం అక్కడ శాంతి భద్రతల సమస్యను సృష్టిస్తోందని ఆరోపించారు. నిన్న మొన్నటిదాకా బతుమ్మ పండుగే లేనట్లుగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత బతుకమ్మ పేరుతో సినిమా చూపించిందని, ఇప్పుడు ప్రధాని మోదీ.. రామాలయం పేరుతో సినిమా చూపిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు ఈ మధ్యనే కళ్లు తెరిచి.. రాములవారిని మొక్కాలని చెబుతున్నారని ఎద్దేవా చేశారు. "రాములవారు పుట్టిన తర్వాత బీజేపీ పుట్టిందా? బీజేపీ పుట్టిన తర్వాత దేవుడు పుట్టాడా? ఆ పార్టీ పుట్టి కేవలం 40 ఏళ్లు అవుతుంది. సీతమ్మ, రాములవారు పుట్టి నాలుగు యుగాలవుతోంది. ప్రధాని మోదీ, ఇక్కడి బీజేపీ నేతలు సీతారాముల కల్యాణం చేస్తారో లేదో తెలియదు నేను. మాత్రం ప్రతియేటా చేస్తాను" అని వ్యాఖ్యానించారు. అయోధ్య గుడికి అసలు కారకుడు బీజేపీ సీనియర్ నేత ఆడ్వాణీ అని, ఆయన దేశమంతా తిరిగి అయోధ్యలో రామాలయం కట్టాలని ప్రచారం చేశారని చెప్పారు. అలాంటి అడ్వాణీని కనీసం సన్మానించారా? అంటూ బీజేపీ నేతలను నిలదీశారు. సొంత పార్టీ నేత అడ్వానీ త్యాగమే గుర్తించని బీజేపీ.. కాంగ్రెస్ పార్టీ నేతల త్యాగం గుర్తిస్తుందా? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌ను ఎందుకు కలిశారో తనకు తెలియదు కానీ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో సీఎంను ఎమ్మెల్యేలు కలవాలంటే కుదిరేది కాదన్నారు. గత తొమ్మిదేళ్లలో దక్కని అవకాశాన్ని సీఎం రేవంత్ 2 నెలల్లోనే కల్పించారన్నారు. గత తొమ్మిదేళ్లుగా చేసిన తప్పులను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌పై బీఆర్ఎస్ నేత కేటీఆర్ ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.




గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న జగ్గారెడ్డి

## ఈసీ ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు

- అమోయ్‌కుమార్, సుశీల్‌కుమార్, శ్రీధర్‌లకు బాధ్యతలు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో వేటు పడిన ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పోస్టింగులు ఇచ్చింది. ఈమేరకు సీఎస్ శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే.. వేటు పడిన అధికారులకు అప్రాధాన్య పోస్టింగులు ఇవ్వడం గమనార్హం. అలాగే సుదీర్ఘకాలం పాటు సింగరేణి సంస్థ సీఎండీగా పని చేసి, ఇటీవల బదిలీ అయి వెయిటింగ్‌లో ఉన్న ఎన్.శ్రీధర్‌కు కూడా ప్రభుత్వం పోస్టింగ్ ఇచ్చింది. ఆయన్ను షెడ్యూల్డు కులాల అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించింది. ఇప్పటివరకు ఈ బాధ్యతలు చూస్తున్న సాగునీటి పారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జాను బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. ఈసీ ఆదేశాలతో పోస్టింగ్‌లు కోల్పోయి, వెయిటింగ్‌లో ఉన్న డి.అమోయ్‌కుమార్‌ను పశు సంవర్ధక శాఖ జాయింట్ సెక్రటరీగా, టి.వినయ్‌కృష్ణారెడ్డిని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా, ఎస్.హరీశ్‌ను రవాణా, రోడ్లు-భవనాల శాఖ జాయింట్ సెక్రటరీగా ప్రభుత్వం నియమించింది. గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.కాత్యాయనిదేవిని బదిలీ చేసి తెలంగాణ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(టీఎస్ఐఆర్‌డీ) సీఈఓగా నియమించింది. ఈ పోస్టు అదనపు బాధ్యతలు చూస్తున్న పంచాయతీరాజ్ శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాను రిలీవ్ చేసింది. అలాగే వెయిటింగ్‌లో ఉన్న నాన్-కేడర్ అధికారి సుశీల్‌కుమార్‌ను గనుల శాఖ డైరెక్టర్‌గా నియమించింది.

### మే నెలలో ఎంసెట్.. నేడు షెడ్యూల్ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వచ్చే మే నెలలో ఎంసెట్ ప్రవేశ పరీక్షను నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్ గురువారం విడుదలకానుంది. ఎంసెట్‌తోపాటు రాష్ట్రంలో నిర్వహించే ఇతర ప్రవేశ పరీక్షల షెడ్యూళ్లను కూడా ఇదే రోజున అధికారులు విడుదల చేయనున్నారు. ఈ ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌కు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఆమోదం తెలిపారు. ఎంసెట్‌తోపాటు లాసెట్, ఐసెట్, ఈసెట్ వంటి ప్రవేశ పరీక్షలను నిర్వహించాల్సి ఉంది. ఈ సెట్ల షెడ్యూల్‌ను ముందుగానే విడుదల చేస్తే అందుకనుగుణంగా విద్యార్థులు సన్నద్ధం కావడానికి అవకాశముంటుంది. అధికారులు కూడా ప్రవేశ పరీక్షలకు సంబంధించి ఏర్పాట్లు చేసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో ఆయా సెట్లను నిర్వహించే కమిటీలు, కన్వీనర్లను కూడా ప్రకటించనున్నారు.

## టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామక ఫైల్‌ను
# సత్వరం ఆమోదించండి

### తమిళిసైతో సీఎం, డిప్యూటీ సీఎం భేటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందర రాజన్‌తో భేటీ అయ్యారు. ప్రభుత్వం తరఫున నిర్వహించే గణతంత్ర దినోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ఆమెను ఆహ్వానించారు. గవర్నర్‌తో 20 నిమిషాలపాటు ప్రత్యేకంగా సాగిన సమావేశంలో.. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ నియామకం, గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పేర్లపై చర్చించినట్లు సమాచారం. టీఎస్‌పీఎస్సీకి చైర్మన్‌ను నియమించి ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న ప్రభుత్వం.. రెండు రోజుల క్రితమే దానికి సంబంధించిన ఫైల్‌ను పంపింది. దానికి సత్వరం ఆమోదం తెలపాలని సీఎం, డిప్యూటీ సీఎం ఈ భేటీలో గవర్నర్‌కు విజ్ఞప్తి చేసినట్టు తెలిసింది. ఆ ప్రక్రియ ముగిసిన వెంటనే సభ్యులకు సంబంధించిన జాబితాను కూడా పంపిస్తామని చెప్పినట్టు సమాచారం. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నందున ఈ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు వారు గవర్నర్‌కు వివరించారు. తమిళిసై కూడా దీనికి సంబంధించి మరిన్ని వివరాలు అడిగి తెలుసుకున్నట్టు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. ఇక గవర్నర్ కోటా ఎమ్మెల్సీల విషయానికి వస్తే.. గత ప్రభుత్వం దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ పేర్లను ప్రతిపాదించగా, వారిని నామినేట్ చేయడానికి తమిళిసై నిరాకరించిన సంగతి తెలిసిందే. గవర్నర్ కోటాలో నియమితులయ్యేవారు సాహిత్యం, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, సమాజ సేవ వంటి రంగాల్లో నిష్ణాతులై ఉండాలి. ఈ అర్హతలు లేవంటూ దాసోజు, కుర్ర పేర్లను గవర్నర్ తిరస్కరించారు. ఈ నేపథ్యంలో.. రేవంత్ సర్కారు ఆ కోటా కింద ఇద్దరి పేర్లను ప్రతిపాదిస్తూ ఫైల్‌ను గవర్నర్‌కు పంపాలని భావించింది. అయితే ఈలోగా దాసోజు శ్రవణ్, కుర్ర సత్యనారాయణ కోర్టుకు వెళ్లారు. తమ పేర్లను తిరస్కరించడం చట్టవిరుద్ధమని.. గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా తమను నామినేట్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వారు కోర్టును కోరారు. దీంతో.. ఈ విషయం కోర్టులో ఉన్నందున తాను నిర్ణయం తీసుకోలేనని రేవంత్ సర్కారుకు గవర్నర్ స్పష్టం చేశారు. తాజాగా బుధవారం ఈ కేసును అడ్మిట్ చేసుకున్న న్యాయస్థానం.. ఎమ్మెల్సీలుగా కొత్త ప్రభుత్వం ప్రతిపాదించినవారిని గవర్నర్ నామినేట్ చేయకుండా స్టే ఇవ్వడానికి నిరాకరించింది. కాబట్టి ఈ ప్రక్రియపై ముందుకు వెళ్లొచ్చనే అభిప్రాయంలో ఉన్న ప్రభుత్వం.. ఆ విషయాన్ని గవర్నర్‌కు తెలిపింది. తాము ఈ కోటాకు అర్హులైన వ్యక్తులనే సిఫారసు చేస్తామని రేవంత్, భట్టి బుధవారం భేటీలో తమిళిసైకి వివరించగా.. దీనిపై న్యాయసలహా తీసుకుంటానని ఆమె చెప్పినట్టు తెలిసింది. ఫిబ్రవరి 2వ వారంలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే ఉద్దేశంతో ఉన్న నేపథ్యంలో రేవంత్, భట్టి ఆ విషయాన్ని కూడా గవర్నర్ వద్ద ప్రస్తావించినట్టు సమాచారం. కాగా.. గత కేసీఆర్ సర్కారు తీరుకు భిన్నంగా గణతంత్ర దినోత్సవాలకు గవర్నర్‌ను నేరుగా కలిసి ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం.. గవర్నర్ ప్రసంగానికి సంబంధించిన విషయాలను కూడా వివరించారు.



రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి

## తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మిర్యాలగూడ టౌన్, జనవరి 24:** ప్రజాసమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండా కావాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. బుధవారం మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ అధ్యక్షతన నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఆర్డీవో చెన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి సమీపిస్తున్న తరుణంలో నీటిఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈదులగూడ, బాదలాపురం తదితర ప్రాంత ప్రజలకు ఇబ్బందిగా మారిన డంపింగ్ యార్డును తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారుల విస్తరణ పనులను వేగవంతం చేయాలన్నారు. బీజేపీ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చిలుకూరు రమాశ్యాం దంపతులు ఎమ్మెల్యే బీఎల్ఆర్‌కు నోట్‌పుస్తకాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇందిరమ్మ కాలనీలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానికులు చైర్మన్ భార్గవ్‌కు వినతిపత్రం అందజేశారు.

## అభివృద్ధి కావాలంటే బెల్ట్‌షాపులు మూయాల్సిందే

**మునుగోడు రూరల్, జనవరి 24 :** గ్రామాల్లో అభివృద్ధి పనులు కావాలంటే బెల్ట్‌షాపులు మూయాల్సిందేనని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కొంపల్లి గ్రామ ఉన్నత పాఠశాలలో కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ సహకారంతో రూ.30 లక్షలతో నిర్మించిన తరగతి గదులను ఫౌండేషన్ చైర్మన్ కోమటిరెడ్డి లక్ష్మితో కలిసి ప్రారంభించారు. మరో మూడు తరగతి గదుల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. అనంతరం మండలంలోని ఊకొండి గ్రామంలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎందరో మహిళా తల్లులు కోరిన మాట ప్రకారమే బెల్ట్‌షాపుల మూసివేత నిర్ణయం తీసుకున్నానని అన్నారు. ఊకొండిలో మద్యానికి బానిసై ఐదుగురు కుమారులు తాగుడుకు బానిసలయ్యారని బుచ్చమ్మ అనే మహిళ కన్నీరుమున్నీరుగా విలపించింది. స్పందించిన ఎమ్మెల్యే బెల్ట్‌షాపులు మూసివేయాలని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, డీసీసీబీ డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నారాబోయిన రవిముదిరాజ్, సర్పంచ్‌లు జాల వెంకన్న, నడింపల్లి యాదగిరి, ఎంపీటీసీ విజయలక్ష్మి, సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బీమనపల్లి సైదులు, బొజ్జ శ్రీనివాస్‌రెడ్డి, వేదిర మేగారెడ్డి, వట్టి కోటి శేఖర్, మాజీ ఎంపీపీ మేడి నాగలక్ష్మి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా ఊకొండి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

### పీహెచ్‌సీని పరిశీలించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**మునుగోడు:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, ఇందుకు అంకితభావంతో పనిచేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం మునుగోడు పీహెచ్‌సీని ఆయన పరిశీలించి, వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆసుపత్రిలో సమస్యలతో పాటు సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నారబోయిన రవిముదిరాజ్, పాల్వాయి చెన్నారెడ్డి, పందుల భాస్కర్, స్వామి, జితేందర్‌రెడ్డి, జంగిలి నాగరాజు, జిట్టగోని యాదయ్య తదితరులు ఉన్నారు.

**మర్రిగూడ :** మండలంలోని లెంకలపల్లి గ్రామంలో పీహెచ్‌సీ ఉప కేంద్ర నిర్మాణానికి ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా ఇందుర్తిమేటి చందాపురంలో పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. కొట్టాలలో వివేకానంద విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, సర్పంచులు పాక నగేష్, కవితయాదయ్య, లక్ష్మీప్రసన్నరవి, ఎంపీటీసీ ఉరిపక్క సరితనగేష్, రామదాసు శ్రీనివాస్, బంగారం, సహస్ర వేదిక సమితి అధ్యక్షుడు కె.అరుణ్‌సాగర్ ఉన్నారు. అదేవిధంగా కుదాబక్షపల్లి రైతులు తమ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు.

## గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి


పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

**హాలియా, జనవరి 24 :** గ్రామీణాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని చింతగూడెం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ మాలే అరుణాసత్యనారాయణరెడ్డి, సర్పంచ్ కూరాకుల లింగయ్య, డీఈ రామాంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ చింతల చంద్రారెడ్డి, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ సాయి, నకిరేకంటి సైదులు పాల్గొన్నారు.

### ఎన్నెస్పీ స్థలాల ఆక్రమణలపై ఆరా

**నాగార్జునసాగర్ :** నాగార్జునసాగర్‌లోని ఎన్నెస్పీ భూములను ఆక్రమించుకోకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి సాగర్ ప్రాజెక్టు సీఈ అజయ్‌కుమార్‌కు సూచించారు. బుధవారం నల్లగొండలోని సీఈ కార్యాలయంలో ఆయన్ను కలిసి ఎన్నెస్పీ భూముల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ దాసరి హరిచందనను కలిసి సాగర్ కాలనీల్లో 58, 59 జీవోల ప్రకారం నివాస గృహాల క్రమబద్ధీకరణను పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్‌చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ప్రసాద్ ఉన్నారు.

## ప్రజల పక్షాన బీఆర్ఎస్ పోరాటం: ఎంపీ లింగయ్యయాదవ్


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లింగయ్యయాదవ్

**కట్టంగూరు, జనవరి 24 :** బీఆర్ఎస్ ప్రజలపక్షాన నిలబడి పోరాడుతుందని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జడ్పీటీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం టీఆర్ఎస్‌ను స్థాపించి ప్రాణాలుపణంగా పెట్టి కేసీఆర్ స్వరాష్ట్రాన్ని సాధించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కచ్చితంగా అమలుచేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జడ్పీటీసీ తరాల బలరాములు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి, పామనగుండ్ల సర్పంచ్ వడ్డే సైదిరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యుడు ఎస్కే. జానీపాష, వార్డు సభ్యుడు రెడ్డిపల్లి మనోహర్ తదితరులు పాల్గొన్నారు.





# బాలికల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి





ఊకొండి గ్రామంలో బాలికలతో కలిసి ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, అడవిదేవులపల్లిలో బాలిక దినోత్సవం సందర్భంగా ర్యాలీ

**మునుగోడు, జనవరి 24 :** బాలికల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పలు మండలాల్లో ర్యాలీలు, వేడుకలు నిర్వహించారు. మునుగోడు మండలం ఊకొండి గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు హాజరైన రాజగోపాల్‌రెడ్డి గ్రామస్థులతో కలిసి ప్రతిజ్ఞ చేశారు. విద్యతోనే భవిష్యత్ మనుగడ సాధ్యమని, అందులో బాలికలకు అసమానతలు లేకుండా సముచితస్థానం కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, పీఏసీఎస్ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, నారబోయిన రవిముదిరాజ్, సర్పంచ్ యాదగిరి, ఎంపీటీసీ విజయలక్ష్మి, సైదులు, ఉపసర్పంచ్ వెంకన్న, అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షకురాలు సరస్వతి, టీచర్లు సుమలత, లింగమ్మ, ఉమా పాల్గొన్నారు.

**అడవిదేవులపల్లి :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, ప్రిన్సిపాల్ అబ్బాస్‌అలీ, పీఈటీ, అంగన్‌వాడీ టీచర్లు నారాయణమ్మ, శోభా, రమాదేవి, మణెమ్మ, రేణుక, బాలికలు పాల్గొన్నారు.

**డిండి :** మండల కేంద్రంలో జాతీయబాలికల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుకరెడ్డి, సిబ్బంది మంగమ్మ, సత్యవాణి, చంద్రకళ, లావణ్య పాల్గొన్నారు.

**హాలియా:** మండలంలోని కొత్తపల్లిలో మహిళలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు గోవిందమ్మ, వజ్రమ్మ, సునీత, నాగజ్యోతి, మంగమ్మ పాల్గొన్నారు.

**తిరుమలగిరి(సాగర్):** మండలకేంద్రంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, యాదమ్మ, కేజీబీవీ ఎస్‌వో కవిత, మీనా, పుష్పలత, విమల, బ్యూలారాణి, హిమబిందు, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, పుష్ప, ఝాన్సీ, పాల్గొన్నారు.

**కనగల్:** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత, హెచ్‌ఎం వెంకటరాంరెడ్డి, ఉపాధ్యాయుడు ఆరూరి జానయ్య, టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

**నార్కట్‌పల్లి :** మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, అంజమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**తిప్పర్తి :** మండలంలోని సర్వారంలో బాలికల సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ సిబ్బంది లక్ష్మి, డి.భారతమ్మ, ఉపాధ్యాయులు సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

**శాలిగౌరారం:** మండల కేంద్రంలోని జేఎంజే పాఠశాలలో బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జ్యోతి, భవానీ, ప్రిన్సిపాల్ జానయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**మర్రిగూడ:** మండలంలోని ఎరుగండ్లపల్లి, కొండూరు గ్రామాల్లోని ఉన్నత పాఠశాల్లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ల అప్రమత్తతతో ప్రమాదాల నివారణ


మిర్యాలగూడలో డ్రైవర్‌ను సన్మానిస్తున్న ఎంవీఐ ప్రవీణ్‌రెడ్డి

**మిర్యాలగూడ టౌన్, జనవరి 24 :** అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ సాధ్యమని ఎంవీఐ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. డ్రైవర్స్‌డే సందర్భంగా బుధవారం మిర్యాలగూడ డిపోలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరైన ఎంవీఐ పలు అంశాలపై అవగాహన కల్పించారు. మద్యానికి దూరంగా ఉండాలని, విధి నిర్వహణలో సెల్‌ఫోన్ వాడరాదన్నారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీఎం పాల్, అధికారులు సంధ్యారాణి, యాదగిరి, వెంకన్న, జనార్దన్, జేఆర్‌రెడ్డి, శ్రీనివాస్, పీఎస్‌రావు పాల్గొన్నారు.

**నల్లగొండ:** డ్రైవర్స్‌డే సందర్భంగా పట్టణంలోని రీజియన్ ట్రైనింగ్ సెంటర్‌లో వేడుకలు నిర్వహించారు. డిపో మేనేజర్, ఎంవీఐలు పాల్గొని ఆర్టీసీ డ్రైవర్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏటీఎం, ఏడీసీ, రీజియన్ ఎల్‌వో ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

**కేతేపల్లి:** మండలంలోని కొర్లపహాడ్ టోల్ ప్లాజా వద్ద జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో డ్రైవర్లకు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. కంటి పరీక్షలు చేశారు. వివిధ వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీఎల్ సాయికుమార్, ఆర్ఈ మల్నాద్రి, ఎస్‌హెచ్ఏఐ అధికారి సతీష్, రామవ, టోల్ మేనేజర్ శివకుమార్, అపోలో టైర్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ స్వప్న, డాక్టర్ రమ, వరలక్ష్మి పాల్గొన్నారు.

**నార్కట్‌పల్లి:** నార్కట్‌పల్లి ఆర్టీసీ డిపోలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లను ఇన్‌చార్జి డీఎం వెంకటమ్మ సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ నర్సింహ, ఎల్‌హెచ్ యాసీన్‌అలీ, టీఐ ఎంవీచారి, కంట్రోలర్ శ్రీనివాసులు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### లారీ ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి

**నల్లగొండ టౌన్, జనవరి 24:** లారీ ఢీకొని డీసీఎం డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన జిల్లా కేంద్రం శివారు నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్ రోడ్డులో జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాల పట్టణానికి చెందిన మహమ్మద్ ఆరీఫ్(26) వృత్తిరీత్యా డీసీఎం డ్రైవర్. ఈ నెల 23న రాత్రి బియ్యంలోడుతో గుంటూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరాడు. బుధవారం తెల్లవారుజామున 1.30 గంటల ప్రాంతంలో పట్టణ శివారులోని నార్కట్‌పల్లి-అద్దంకి బైపాస్‌పై కనకమహాలక్ష్మి రైస్‌మిల్ సమీపంలో ఓ వాహనం టైర్ పంచరై రోడ్డుపై పడటంతో అందులోని వారు రోడ్డును క్లియర్ చేస్తున్నారు. దీనిని గమనించిన ఆరీఫ్ డీసీఎం దిగి ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు తెలుసుకుని, తిరిగి వాహనం వద్దకు వెళ్తుండగా వెనకాల వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆరీఫ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆరీఫ్ అవివాహితుడు కాగా అతడి సోదరుడు బషీర్ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**మర్రిగూడ, జనవరి 24:** రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ రంగారెడ్డి, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం కొట్టాల గ్రామానికి చెందిన బుర్ర రవి బైక్‌పై మర్రిగూడ నుంచి కొట్టాల గ్రామానికి వెళ్తుండగా, రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్ మర్రిగూడకు బైక్‌పై వెళ్తున్నాడు. రాంరెడ్డిపల్లి గ్రామ శివారులో రవి అతివేగంగా వెంకటేష్ వాహనాన్ని ఢీకొట్టడంతో ఇద్దరికి గాయలయ్యాయి. ఇరువురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో మర్రిగూడ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి హైదరబాద్‌కు తరలించారని ఎస్ఐ తెలిపారు. బైక్‌పై ఉన్న కొట్టాల గ్రామానికి చెందిన మరో ఇద్దరు జెల్లాకుల యాదయ్య, పాల సత్తయ్యలకు సల్ప గాయాలయ్యాయి.

### వైద్యులు లేకపోవడంతో గ్రామస్థుల ఆందోళన

రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వ్యక్తులను వైద్యసేవల కోసం మర్రిగూడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తే 10మంది డాక్టర్లలో ఒకే ఒక మహిళ డాక్టర్ ఉందని రాంరెడ్డిపల్లి గ్రామస్థులు ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేశారు. వైద్యులు హాజరై వైద్యసేవలు అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో మాజీ జడ్పీటీసీ మేతరి యాదయ్య, రాందాసు శ్రీనివాస్, రావుల రాములు, రేవంతా, హనుమంత్ పలువురు గ్రామస్థులు ఉన్నారు.

### మోటర్ ఇనుప ట్రాకుల అపహరణ

**నాగార్జునసాగర్, జనవరి 24:** సాగర్‌లోని కాలనీలకు తాగునీటి సరఫరాకు కృష్ణానదిలో మోటార్లను వేసి రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన ఇనుప ట్రాకులు చోరీకి గురయ్యాయి. హిల్‌కాలనీ పాత ఫిల్టర్‌హౌజ్ దిగువన మోటార్లను నదిలోకి దింపేందుకు కిలోమీటర్ మేర పొడవున్న ఇనుప ట్రాకును ఏర్పాటుచేశారు. అయితే ప్రస్తుతం ఆ ట్రాకులను ఉపయోగంలో లేవు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు ఇనుప ట్రాకులను గ్యాస్‌కట్టర్‌తో ముక్కలుగా చేసి చోరీ చేశారు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అధికారులకు తెలిపారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎన్నెస్పీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

### జాన్‌పహాడ్‌కు ప్రత్యేక బస్సులు

**మిర్యాలగూడ టౌన్, జనవరి 24 :** సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహడ్ జాతరకు ప్రత్యేక బసులు నడిపించనున్నట్లు ఆర్టీసీ డీఎం బొల్లెద్దు పాల్ తెలిపారు. నేటి నుంచి 27వ తేదీ వరకు దామరచర్ల మీదుగా 20 ప్రత్యేక బస్సులు ఏర్పాటుచేశామని, రద్దీకి అనుగుణంగా అదనపు బసులు నడిపించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం నిర్వహించే డయలల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికులు 9959226308 నెంబరుకు కాల్ చేసి సమస్యలను తమ దృష్టికి తేవాలని కోరారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**కనగల్, జనవరి 24 :** మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం విద్యుత్ స్తంభాలను తొలగిస్తున్నామని, ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖరాచారి తెలిపారు.అసౌకర్యాన్ని వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలన్నారు.

### ఇసుక ట్రాక్టర్ సీజ్

**కనగల్, జనవరి 24:** మండలంలోని ఎస్.లింగోటం గ్రామ వాగు నుంచి ఇసుకను రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు బుధవారం సీజ్ చేశారు. ఎస్ఐ రామక్రిష్ణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మట్టపల్లి అనిల్ ఎలాంటి అనుమతులు లేకుండా తన ట్రాక్టర్ ద్వారా ఇసుకను నల్లగొండ పట్టణానికి తరలిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో వెళ్లి మార్గమధ్యలో పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

### చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

**దేవరకొండ, జనవరి 24 :** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలల రీజనల్ కోఆర్డినేటర్ కే లక్ష్మయ్య అన్నారు. బుధవారం దేవరకొండ మండలం కొమ్మెపల్లిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో పాటు క్రీడలు, సైన్స్‌ఫేర్‌లో ప్రతిభ కనబరిచిన విజేతలకు బహుమతులు అందజేసి, మాట్లాడారు. ఆదిలాబాద్‌లో ఈ నెల 18, 20 తేదీల్లో నిర్వహించిన అండర్-19 కేటగిరిలో 1500 మీటర్లు, 300 మీటర్ల పరుగుపందెం పోటీల్లో గోల్డ్‌మెడల్ సాధించిన నేనావత్ ధోనిని అభినందించి, బహుమతులు అందజేశారు. వీరితోపాటు వివిధ క్రీడల్లో రాణించిన క్రీడాకారులకు షీల్డులు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గిరిజన కళాశాల ప్రిన్సిపాల్ ఏకుల రఘుపతి, కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

#### క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తా: ఆర్డీవో

క్రీడాకారులకు తనవంతుగా ప్రోత్సాహం అందిస్తానని దేవరకొండ ఆర్డీవో శ్రీరాములు అన్నారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని కృష్ణవేణి పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి, మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డి, రాజ్‌కుమార్‌రెడ్డి, ఎన్‌వీటీ, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

### 'ధరణి'లో అపరిష్కృత సమస్యల పరిష్కారానికి కృషి

**తిరుమలగిరి(సాగర్), జనవరి 24 :** ధరణిలో చోటుచేసుకున్న అపరిష్కృత సమస్యల పరిష్కారానికి నూతనంగా ఏర్పడిన కమిటీ కృషి చేస్తోందని ధరణి భూసమస్యల పరిష్కార కమిటీ సభ్యుడు, నల్సార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎం.సునీల్‌కుమార్(భూమి సునీల్) అన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ధరణి భూసమస్యల పరిష్కార కమిటీలో సునీల్‌కుమార్‌ను నియమించడంతో జిల్లాకు చెందిన గిరిజన సంఘాల నాయకులు బుధవారం ఆయన్ను హైదరాబాద్‌లో సన్మానించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా బంజారా సంఘం అధ్యక్షుడు, రిటైర్డ్ ఆర్డీవో నవీన్‌నాయక్, నల్లగొండ జిల్లా కార్మిక సంఘం అధ్యక్షుడు కేలావత్ నగేష్‌నాయక్, నరసింహనాయక్, నాగార్జుననాయక్ తదితరులు ఉన్నారు.

### బీఆర్ఎస్ తీరు హాస్యాస్పదం: టీడీపీ

**మునుగోడు, జనవరి 24 :** కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయటం హాస్యాస్పదంగా ఉందని టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, మునుగోడు నియోజకవర్గ ఇన్‌చార్జి జక్కలి ఐలయ్యయాదవ్ ఎద్దేవాచేశారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు రైతులకు రుణమాఫీ అమలు చేయనివారు ప్రస్తుతం రుణమాఫీ పథకంపై మాట్లాడటం ఏంటని ఆయన ప్రశ్నించారు. నియోజకవర్గంలో బెల్ట్‌దుకాణాలను మూసివేయిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి నిర్ణయాన్ని పార్టీ స్వాగతిస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ పార్లమెంట్ ప్రధానకార్యదర్శి మక్కెన అప్పారావు, నాయకులు దోమల వెంకన్న, మొగుదాల పార్వతమ్మ, లింగయ్య, యాదయ్య, పొడపంగి సైదులు, యాదయ్య, మహేష్, ఇటుకలపాటి తదితరులు ఆరోగ్యం పాల్గొన్నారు.

### దగాకు గురవుతున్న తెలంగాణ ఉద్యమం

**నల్లగొండ టౌన్, జనవరి 24 :** ఎందరో త్యాగాల ఫలితంగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో తెలంగాణ ఉద్యమం ప్రస్తుతం దగాకు గురవుతోందని ప్రజాసంఘాల జేఏసీ జిల్లా చైర్మన్, తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా కన్వీనర్ పెరిక కరణ్‌జయరాజ్ అన్నారు. 'తెచ్చింది ఎవరు, ఇచ్చింది ఎవరు' అనే వాల్‌పోస్టర్‌ను బుధవారం ఎన్జీ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి మూడో వారంలో హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో 'తెచ్చింది ఎవరు, ఇచ్చింది ఎవరు' అనే పేరుతో సభను నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కోకన్వీనర్ పర్వతం వేణు, బీసీ సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి సంజయ్, సురేష్, మామిడి వినోద్, వేణు, సింగం శ్రీకాంత్, శ్రవణ్, మహేష్, రాంబాబు, శ్రీకాంత్, కొండా మహేష్, సైమన్, పవన్, హరికాంత్ పాల్గొన్నారు.

### హనుమంతు చంద్రన్న ఆశయ సాధనకు కృషి చేయాలి


వర్ధంతి సభలో మాట్లాడుతున్న రవీంద్రకుమార్

**దేవరకొండ, జనవరి 24 :** దేవరకొండ మాజీ సర్పంచ్, కార్మిక నాయకుడు దివంగత హనుమంతు చంద్రన్న ఆశయ సాధనకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. బుధవారం దేవరకొండలో హనుమంతు చంద్రన్న 19వ వర్ధంతిని పురస్కరించుకొని చంద్రన్న విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్త్య రమేష్‌నాయక్, జడ్పీటీసీ మారేపాకల అరుణ సురేష్‌గౌడ్, టీవీఎన్ రెడ్డి, హనుమంతు చంద్రన్న కుమారులు హనుమంతు వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, నారాయణ, గెల్వయ్య, ఎన్‌వీటి, ఎస్ఎన్.చారి, పున్న వెంకటేశ్వర్లు, శ్రీశైలం యాదవ్, చంద్రన్న అభిమానులు పాల్గొన్నారు.




**అడవిదేవులపల్లి:** పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండలానికి చెందిన వడిత్య వెంకట్రామ్‌నాయక్ ఎన్నికయ్యారు. అదేవిధంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ధరావత్ సైదులుతో పాటు జిల్లా మహిళ కార్యదర్శిగా పాతులోతు మౌనికలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

**త్రిపురారం :** మండలంలోని చెన్నాయిపాలెంలో పశుగర్భకోశ పరీక్ష చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. మండల పశువైద్యాధికారి శశికళారెడ్డి నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నామరాజు, ఉపసర్పంచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**నల్లగొండ స్పోర్ట్స్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి సాఫ్ట్ బాల్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ ప్రైమ్ పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు సాఫ్ట్ బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధానకార్యదర్శి ముల్కా నాగిరెడ్డి ఒక పకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు వివరాలకు 9440555736, 9154359463 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

**మిర్యాలగూడ టౌన్:** రోటరీ క్లబ్ క్లబ్ సభ్యులు మాశెట్టి భాగ్యలక్ష్మిశ్రీనివాస్ ఆధ్వర్యంలో పట్టణంలోని 155 మంది హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, రేపాల అంతయ్య పాల్గొన్నారు.

**గుర్రంపోడు:** మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన మేడి సైదులును నియమిస్తున్నట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమాన్ తెలిపారు. సైదులు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

**హాలియా:** హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యువజన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశానికి జిల్లా అధ్యక్షుడు గౌని రాజారమేష్‌యాదవ్ హాజరయ్యారు. పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షిని కలిసి తాము చేపట్టిన కార్యక్రమాలను ఆయన వివరించారు. అనంతరం ఆమెను సన్మానించారు.

**నార్కట్‌పల్లి:** స్థానిక వైఎస్ఆర్‌కాలనీలో ఆవుదొడ్డి రాములు, చింతకింది అంబ కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు చల్లా తేజ పరామర్శించి, వారికి రూ.10,000ల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దూదిమెట్ల సత్తయ్య, సట్టు సత్తయ్య, కొమ్మనబోయిన మల్లేశ్, భాస్కర్ పాల్గొన్నారు.

**నల్లగొండ టౌన్ :** జిల్లాలో ఆరు గ్యారెంటీ పథకాలపై ఇంటింటి ప్రచారంలో మొదటి స్థానంలో నల్లగొండకు చెందిన షేక్ జహంగీర్‌బాబా మొదటి స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి ఆయనకు ప్రశంసాపత్రం అందజేశారు.

**శాలిగౌరారం:** రైతుబంధు రావట్లేదని అడిగితే చెప్పు తీసుకొని కొట్టమని సలహాలు ఇవ్వడం సిగ్గుచేటు అని ఆమ్ ఆద్మీ పార్టీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యంపల్ల పురుషోత్తంరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఆయన మాట్లాడారు. ప్రస్తుత గడ్డు పరిస్థితుల్లో రైతులు రైతుబంధుని ఆశించడం న్యాయమే అన్నారు.

**పెద్దవూర:** వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని మండలంలోని చలకుర్తి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తుమ్మలపల్లి లలితవెంకట్‌రెడ్డి, ఎస్‌బీఐ మేనేజర్ అశోక్‌కుమార్, ఉపసర్పంచ్ పిల్లి శంకర్ పాల్గొన్నారు.

**డిండి :** టీఎస్‌యూటీఎఫ్ మండల నూతన కమిటీని మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గండమళ్ల రామారావు, ప్రధాన కార్యదర్శిగా నారోజు పవన్, కోశాధికారిగా ఉషారాణి, ఇతరులను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గిరి యాదయ్య వ్యవహరించారు.

**గుర్రంపోడు:** మండలంలోని పోచంపల్లిలో శ్రీజ్ఞానసరస్వతీ గ్రంథాలయ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పాల్గొని క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు, అండర్-19 క్రికెట్‌లో ప్రతిభ కనబరిచిన స్రవంతికి స్కాలర్‌షిప్‌ను అందజేశారు.

**నిడమనూరు:** నాయీ బ్రాహ్మణ సంఘం జాతీయ నాయకుడు కర్పూరి ఠాకూర్ శతజయంతి ఉత్సవాల సందర్భంగా కేంద్రం భారతరత్న అవార్డు ప్రకటించడంపై మండల నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు వెంపటి పుల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. భారతరత్న ప్రకటించిన రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీలకు కృతజ్ఞతలు తెలిపారు.

**త్రిపురారం :** మండలంలోని కంపాసాగర్‌లో ఇటీవల అనారోగ్యంతో రోశమ్మ మృతి చెందింది. ఆమె కుటుంబానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొండా భాస్కర్ రూ.5వేలు, 50 కిలోల బియ్యం అందజేశారు.

**మాడ్గులపల్లి:** రేషన్ డీలర్లు సకాలంలో సరుకులు అందించాలని తహసీల్దార్ జమీరొద్దిన్ అన్నారు. తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. సరుకుల పంపిణీలో పారదర్శకంగా ఉండాలన్నారు.

**మాడ్గులపల్లి:** మండలంలోని బుగ్గబావిగూడెం గ్రామానికి చెందిన పుట్ట జానయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. అతడితో పాటు పనిచేసే హమాలీలు జానయ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.30వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో వెంటపాక లక్ష్మయ్య, రావుల వెంకన్న, గోగు వెంకన్న, నల్లగంతుల రాములు, గుండెబోయిన సైదులు, కృష్ణ, సైదులు, గిరి, నాగరాజు పాల్గొన్నారు.

**నార్కట్‌పల్లి:** సేవ చేద్దాం...వెలుగునిద్దాం (ఎస్‌సీవీఎన్) స్వచ్ఛంద సంస్థకు పుడమి సాహితీ వేదిక జాతీయ పురస్కారం లభించింది. పురస్కారాన్ని వేదిక జాతీయ అధ్యక్షుడు బాల్‌రెడ్డి స్వచ్ఛంద సంస్థ మాదగోని రాకేశ్‌కు అందజేశారు.

**శాలిగౌరారం:** వల్లాల గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శెట్టిపల్లి రాంరెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబసభ్యులకు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి పంపిన రూ.50వేల ఆర్థికసాయాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమరంరెడ్డి అందజేశారు.

### పనిచేయని పాస్‌బుక్ ప్రింటింగ్ మిషన్లు

**డిండి, జనవరి 24:** రైతుల పాస్‌పుస్తకాలలో వివరాలు పొందుపరిచేందుకు తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాస్‌బుక్ ప్రింటింగ్ మిషన్‌లు నెలలతరబడి పనిచేయడంలేదు. దేవరకొండ నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో పీఏపల్లి మండలం మినహా, ఏ ఒక్క తహసీల్దార్ కార్యాలయంలో ఈ మిషన్‌లు పనిచేయకపోవడంతో రైతులు ఇబ్బందులుపడుతున్నారు. పట్టాదార్ పాస్‌పుస్తకం ఉన్న రైతు భూమి కొనుగోలు చేస్తే అదే పాస్‌పుస్తకంలో కొనుగోలు చేసిన అదనపు భూమి వివరాలను పొందపరిచి తహసీల్దార్ కార్యాలయంలో ఇవ్వాల్సి ఉంది. కానీ నెలల తరబడి పాస్‌పుస్తకం ప్రింటింగ్ మిషన్లు పనిచేయకపోవడంతో డిండి మండలానికి చెందిన కొందరు పీఏపల్లికి వెళ్లి ప్రింట్ తీసుకోవాల్సి వస్తుంది. దీనిపై తహసీల్దార్ తిరుపతయ్యను వివరణ కోరగా చాలారోజులుగా మిషన్‌లు పనిచేయడంలేదన్నారు.